సాక్షి
వికారాబాద్

బుధవారం । 29 । జనవరి । 2025



పక్కదారి పట్టకుండా..

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. 8లో▸



చిరుత కాదు.. అడవి పిల్లి

యాలాల మండలం జక్కేపల్లి శివారులో సంచరిస్తోంది చిరుత కాదని అడవి పిల్లి అని అటవీ శాఖ అధికారులు గుర్తించారు. 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రత్నం పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

గ్రామీణ రోడ్లకు మహర్దశ

17 పనులకు రూ.15.20 కోట్లు మంజూరు

తాండూరు: నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్‌ద్వారా ప్రభుత్వం 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రంలోని గ్రామీణ రోడ్లను మెరుగు పరిచేందుకు రూ.1, 288 కోట్లు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల్లోని పంచాయతీ, జెడ్పీ ఆధీనంలో ఉన్న గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.15.20 కోట్లు విడుదల చేసింది. 17 రోడ్లు.. 35 కిలో మీటర్ల రహదారులను అభివృద్ధి చేయనున్నారు. దాదాపు 80 గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలను ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు చేకూరేలా పాలన సాగిస్తున్నారని తెలిపారు. నియోజవకర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.220 కోట్లు మంజూరైనట్లు వివరించారు. తాండూరు - వికారాబాద్ రోడ్డు పనులు చేయని కాంట్రాక్టర్‌ను తప్పించి మరొకరికి పనులు అప్పగించనున్నట్లు తెలిపారు.

31లోగా వాహన పన్ను చెల్లించాలి

రవాణా శాఖ జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి



అనంతగిరి: జిల్లాలోని వాహనదారులు ఈ నెల 31లోపు త్రైమాసిక పన్ను చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయిలు దాదాపు రూ. 2కోట్ల వరకు ఉంటుందని, ట్రాక్టర్లు, ట్రావెల్స్, హార్వెస్టేర్స్, భారీ, మధ్య, చిన్న వాహనాలు, బోరు బండ్లు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ వాహనాలు, స్కూల్ బస్సులు ఉన్నాయన్నారు. మీసేవా లేదా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. గడువు లోగా పన్ను చెల్లించని వాహనాలకు 200శాతం అపరాధ రుసుం చెల్లించావల్సి ఉంటుందన్నారు. వాహనదారుడు తమ వాహనాన్ని వారి మొబైల్ నంబర్‌కు లింక్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9848528441లో సంప్రదించాలన్నారు.

తాండూరు సబ్ రిజిస్ట్రార్ ఐజీ కార్యాలయానికి అటాచ్

తాండూరు: తాండూరు సబ్ రిజిస్ట్రార్ పుర్యను మంగళవారం ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన ఆయన జూనియర్ అసిస్టెంట్ సాయికి బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. ఇటీవల కాలంలో పుర్యపై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో ఆయన్ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని రంగారెడ్డి డీఈఓ సుశీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యయులకు సర్వీస్ రూల్స్, ఇన్‌కం టాక్స్‌పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులుగా తమ విధులు, బాధ్యతలను గుర్తించుకోవాలని తెలిపారు. ఉద్యోగానికి సంబంధించి సర్వీస్ రూల్స్, ఇన్‌కంటాక్స్‌పై అందరికీ సరైన అవగాహన ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించటం జరిగిందని చెప్పారు. ఉపాధ్యాయులపై ఉండే ఒత్తిడిని ఎలా నివారించుకోవాలి, ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై డాక్టర్ శ్రీధర్ దిశా నిర్దేశం చేశారు. ఇన్‌కం ట్యాక్స్ రూల్స్‌పై ఐటీ ఎక్స్‌పర్ట్ రవికుమార్ అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ అంశాలపై రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు వివరించారు. సమావేశంలో చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు కానాపూర్ హెచ్‌ం వెంకటయ్య, జయసింహారెడ్డి, ఎంఈఓలు పురన్‌దాస్, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరధర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి, చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాలకు చెందిన గెజిటెడ్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పెట్టింది తినాల్సిందే..

సాక్షి విజిట్

మెస్ చార్జీలు పెంచాలి

మోమిన్‌పేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి ప్రభుత్వం మంజూరు చేసున్నా మెస్ చార్జీలు సరిపోవడం లేదు. బహిరంగ మార్కెట్ గుడ్డు ఒక్కటి రూ.7 కాగా ప్రభుత్వం రూ.5లే ఇస్తోందని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. డబ్బులు సరిపోక కట్టెల పొయ్యి మీదే వంట చేస్తున్నామని తెలిపారు. సన్న బియ్యం సరఫరా చేస్తున్నప్పటి నుంచి భోజనం రుచిగా ఉందని విద్యార్థులు చెప్పారు. మంగళవారం మోమిన్‌పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ, అన్నం, సాంబారు, మిశ్రమ కూరగాయల కరీ వడ్డించారు. మెస్ చార్జీలు పెంచాలని ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు. అలాగే సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు.



కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తూతూ మంత్రంగా అమలవుతోంది.. చాలా బడుల్లో మెనూ ప్రకారం వంటలు చేయడం లేదు. ఉడకని అన్నం.. నీళ్ల చారు.. పప్పు వడ్డిస్తున్నారు. దీంతో విద్యార్థులు భోజనం సరిగ్గా చేయడం లేదు. అర్ధాకలితో చదువుకొంటున్నారు. ఇదిలా ఉండగా సకాలంలో బిల్లులు రాక ఏజెన్సీ నిర్వాహకులు అప్పులు చేసి సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.7 ఉండగా ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తోంది. దీంతో గుడ్లు సరఫరా చేసే ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఇవ్వాలని కోరుతున్నారు. సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై మంగళవారం 'సాక్షి' విజిట్ చేయగా అనేక విషయాలు వెలుగుచూశాయి..

- వివరాలు 9లో▸



బషీరాబాద్‌లో నేలపై కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

పుస్తెల తాడు తాకట్టు పెట్టి..



పరిగి: మధ్యాహ్న భోజన పథకం బిల్లులు సక్రమంగా విడుదల కావడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు పుస్తెల తాడు కుదపెట్టా.. దుకాణాల్లో సరుకులు అప్పు ఇవ్వడం లేదు. కొద్ది రోజుల క్రితం 6, 7, 8వ తరగతి విద్యార్థులకు సంబంధించిన బిల్లులు వచ్చాయి. కానీ 9, 10వ తరగతి విద్యార్థుల బిల్లులు రాలేదు. 11 నెలల బిల్లులు రావాల్సి ఉంది. అయినా మెనూ పాటిస్తున్నాం. ప్రతి వారం అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి నెలా బిల్లులు మంజూరు చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– సత్యమ్మ, నస్కల్ ఉన్నత పాఠశాల, భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు

త్వరలో పరిహారం

- పారిశ్రామికవాడకు భూములు ఇచ్చే రైతులకు లబ్ధి
- చెక్కుల పంపిణీకి రంగం సిద్ధం
- అధికారిక ప్రకటనే తరువాయి



ఇటీవల కలెక్టరేట్‌లో పోలేపల్లి, హకీంపేట్ రైతులతో సమావేశమైన కలెక్టర్ ప్రతీక్‌జైన్

దుద్యాల్: మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాల పరిధిలో మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయ తెలిసిందే.. ఇందులో భాగంగా హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూ సేకరణ కోసం సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. హకీంపేట్ గ్రామ సర్వే నంబర్ 252లో 218 మంది రైతులకు చెందిన 351 ఎకరాల అసైన్డ్ భూమిని, పోలేపల్లి గ్రామ సర్వే నంబర్ 67లో 33 మంది రైతులకు చెందిన 71.39 ఎకరాల అసైన్డ్ భూముల సర్వేను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికను రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు అందజేశారు. సర్వేతో పాటు రెండు గ్రామాలకు చెందిన 422.39 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 251 మంది రైతుల అంగీకార పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. త్వరలో వీరందరికీ పరిహారం చెక్కులు అందనున్నట్లు తెలిసింది. అధికారులు సైతం రైతులకు పరిహారం చెక్కులు సిద్ధం చేసినట్లు సమాచారం. పారిశ్రామిక వాడలో భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.20 లక్షలు, 150 గజాల డీటీసీపా లేఅవుట్ ప్లాట్, ఇందిరమ్మ ఇల్లు, పరిశ్రమల్లో అర్హతలను బట్టి ఉద్యోగం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఒక వేళ రైతుకు గుంట నుంచి అర ఎకరం వరకు భూమి ఉంటే వారికి ఇళ్లు కట్టుకోవడానికి అనువుగా స్థలం (75 గజాలు) ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అభివృద్ధికి అడిగినన్ని నిధులు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం: అభివృద్ధి పనులకు అడిగినన్ని నిధులు మంజూరు చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించి కొత్త వాటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. అర్హులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూమి లేని నిరుపేద రైతులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. సాగుకు మోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా సాయం అందుతుందని స్పష్టం చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. పథకాలు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అంతకుముందు కోట్‌పల్లిలో చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, ఎంపీడీఓలు రాములు, డానియల్, నాయకులు పురుషోత్తంరెడ్డి, మొగులయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ, పాల్గొన్న పోలీసు అధికారులు

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో ఇసుక, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ల వారీగా నమోదైన కేసులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు గల కారణాలను తెలుసుకొని వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా కళాజాత బృందాలతో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక, గుట్కా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాను అరికట్టాలని అధికారులకు సూచించారు. నేరస్థులను పట్టుకోవడంలో సీసీ టీవీల పాత్ర ఎంతో ఉంటుందని వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీకెండ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపట్టాలని తెలిపారు. మహిళలు, యువతులను వేధించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేర చరిత్ర ఆధారంగా రౌడీ షీట్, పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్, పరిగి, తాండూరు డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల తర్వాత ఇంటికి

- భర్తమృతి, ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు వదిలిన మహిళ
- హైదరాబాద్‌లో భిక్షాటన చేస్తూ జీవనం
- గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన సామాజిక కార్యకర్త



వెంకటమ్మను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

యాలాల: భర్త అకాల మరణం, కుటుంబ పోషణ ఎలా..? అనే సందిగ్ధంతో ఎనిమిదేళ్ల క్రితం ఇద్దరు పిల్లలు, కుటుంబ సభ్యులను వదిలి వెళ్లిన ఓ మహిళ నగరంలో భిక్షాటన చేస్తూ కాలం గడిపింది. ఆమెను గుర్తించిన కొందరు సోషల్ ఆర్గనైజింగ్ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. యాలాల మండలం అచ్యుతాపూర్‌కు చెందిన వెంకటమ్మకు బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన చంద్రయ్యతో వివాహమైంది. వీరికి మారుతి, నరేశ్ ఇద్దరు సంతానం. వీరి చిన్నతనంలోనే భర్త చనిపోవడంతో వెంకటమ్మ తన ఇద్దరు పిల్లలను తీసుకొని అచ్యుతాపూర్‌లోని తల్లిగారింటికి వచ్చేసింది. కాగా ఇద్దరు పిల్లలను ఎలా సాకాలనే ఆలోచన, ఆర్థిక పరిస్థితులతో మానసిక వేదనకు గురై.. ఎవరికీ చెప్పకుండా ఎనిమిదేళ్ల క్రితం ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, ఇరుగు, పొరుగు గ్రామాల్లో వెతికినా ఫలితం లేకుండా పోయింది.

భిక్షాటన చేస్తుండగా గుర్తు పట్టి..

ఎనిమిదేళ్ల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయిన వెంకటమ్మ నగరంలోని అత్తాపూర్‌లో రోడ్లపై భిక్షాటన చేస్తూ కాలం గడిపింది. కాగా ఇటీవల అచ్యుతాపూర్ గ్రామానికి కొందరు అత్తాపూర్‌లో వెంకటమ్మను చూసి గుర్తు పట్టారు. ఈ విషయాన్ని ఆమె పెద్దనాన్న కుమారుడైన (అన్న) అనంతయ్యకు చెప్పారు. సామాజిక కార్యకర్త వెంకటేశ్ కాంగ్రెస్ పార్టీ దోర్నాల్ ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, మైనార్టీ నాయకుడు అహ్మద్ సాయంతో అనంతయ్య అత్తాపూర్ వెళ్లారు. పిల్లర్ నంబర్ 64 వద్ద భిక్షాటన చేస్తుండగా ఆమెను గుర్తు పట్టి కలిశారు. అనంతయ్యను గుర్తుపట్టిన వెంకటమ్మ తన కొడుకులు మారుతి, నరేశ్‌ను హత్తుకుని బోరున విలపించింది. కుటుంబ విషయాలు, గతంలోని జ్ఞాపకాలు, ప్రస్తుత పరిస్థితులను ఆమెతో చర్చించి సొంతూరుకు తీసుకెళ్లారు. యాలాల పోలీసుల సమక్షంలో మంగళవారం సాయంత్రం వెంకటమ్మను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎనిమిదేళ్ల తరువాత వెంకటమ్మ ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగారు.

'చుక్'చకా..

షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ

- అమృత్ భారత్ పథకం కింద ఎంపిక
- రూ.9.59 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- చురుగ్గా సాగుతున్న పనులు



షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఆవరణలో నిర్మిస్తున్న ముఖద్వారం

షాద్‌నగర్: రైల్వే దశను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ల రూపురేఖలు మార్చేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఆధునికీకరణతో పాటు ప్రయాణికులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో 15 రైల్వే స్టేషన్లను ఎంపిక చేసింది. అందులో షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేసి అభివృద్ధికి రూ.9.59 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అత్యాధునిక సదుపాయాలు

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. స్టేషన్ ముందు ఉన్న స్థలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్‌లో వీఐపీ లాంచ్, లిఫ్టులు, టైల్స్, షెడ్స్, మరుగుదొడ్లు, మహిళలకు ప్రత్యేక గెస్టు హౌస్, పార్కింగ్ గార్డెన్‌లను నిర్మిస్తున్నారు. స్టేషన్ ఆవరణలో అత్యాధునిక అనౌన్స్‌మెంట్ సిస్టం, విద్యుత్ బోర్డులు, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే పెయింటింగ్స్, ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థ, అత్యాధునిక ముఖ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు.

వడివడిగా పనులు

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. ఏడాది క్రితం ప్రధాని మోదీ అభివృద్ధి పనులను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ప్రస్తుతం స్టేషన్ ఆవరణలోని స్థలాన్ని సుందరంగా మార్చుతున్నారు. ఆర్చ్, పార్కింగ్ గార్డెన్ పనులు చకచకా సాగుతున్నాయి. అదేవిధంగా భారీ ఐరన్ చానల్స్‌తో నిర్మాణ పనులు కొనసాగుతన్నాయి.

ఎర్రజెండా అంటేనే భరోసా

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

చేవెళ్ల: ఎర్ర జెండాను చూస్తే నిరుపేదలు గుండెకు హత్తుకుంటారని, భూస్వాములు, దోపిడీదారులు భయపడతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం నియోజకవర్గ కార్యదర్శి కె.రామస్వామి అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ.. దేశ గడ్డపై 99 ఏళ్లు పూర్తి చేసుకొని శంత వసంతంలోకి అడుగుపెడుతున్న ఏకైక పార్టీ జెండా సీపీఐ అని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు అధికారం లేకపోయినా, పదవులు లేకపోయిన, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన గొప్ప సిద్ధాంతం కమ్యూనిజం అని తెలిపారు. దోపిడీ కోటలను కూల్చి పేదల రాజ్యాన్ని నిర్మించిన చరిత్ర ఈ పార్టీకి ఉందన్నారు. భూమికోసం భుక్తికోసం పేదల విముక్తికోసం నిజాం రాజుకు వ్యతిరేకంగా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిందని, ఏనాడు ప్రభుత్వాల కు రాజీ పడలేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు పి.పర్వతాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్

బొంరాస్‌పేట్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న సంఘటన మండల పరిధిలోని వడిచర్ల గేట్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాహుఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారు జామున 3 గంటల సమయంలో దేవనూర్ వాగు నుంచి వడిచర్లకి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడు ఖాసీంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏ-2 సురేశ్‌కు బెయిల్ మంజూరు



బెయిల్‌పై బయటికి వస్తున్న సురేశ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో గత ఏడాది నవంబర్ 11న కలెక్టర్, అధికారులపై జరిగిన దాడి ఘటన కేసులో ఏ-2గా ఉన్న బోగమోని సురేశ్‌కు బెయిల్ మంజూరైంది. మంగళవారం నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. చెంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న సురేశ్‌కు లక్ష రూపాయల పూచికత్తుతో పాటు ప్రతి సోమవారం బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలనే షరతులతో బెయిల్ మంజూరు చేసింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు కోట్ల మైపాల్, నర్సింహ రాథోడ్, నెహ్రూ నాయక్ సురేశ్‌కు స్వాగతం పలికారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



ధ్వంసమైన స్తంభం

ధారూరు: తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎంహెచ్ 40, ఏకే 8977 నంబర్ లారీ మంగళవారం మధ్యాహ్నం ధారూరు పోలీస్ స్టేషన్ ముందు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ధ్వంసం చేసింది. డ్రైవర్ లారీ ఆపకుండా వెళ్లిపోతుండటంతో స్థానికులు లారీని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కరెంటు సరఫరా నిలిపేసి, యుద్ధప్రాతిపదికన కొత్త స్తంభం ఏర్పాటు చేశారు.

విదేశీ యువతులతో వ్యభిచారం

గచ్చిబౌలి: విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయ్యింది. మంగళవారం రాత్రి టీఎన్‌జీవోస్ కాలనీలోని ఓ ఇంట్లో గచ్చిబౌలి పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఒక విటుడు, 9 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. టాంజానియా, కజికిస్తాన్‌కు చెందిన యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో దాడులు చేశారు.

పక్కదారి పట్టకుండా!

- కోడిగుడ్లపై మూడు రంగుల్లో ముద్రలు
- అక్రమాలకు తావు లేకుండా పంపిణీలో మార్పు

దుద్యాల్: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం కోడిగుడ్లను అందజేస్తున్న విషయం విదితమే. అంగన్వాడీ కేంద్రాల్లోని కోడి గుడ్లు పక్కదారి పడుతున్నాయనే ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కోడి గుడ్ల పంపిణీలో మార్పు చేసింది. అవి లబ్ధిదారులకు సక్రమంగా అందాలనే భావనతో అంగన్వాడీ కేంద్రాలకు అందించే కోడి గుడ్లపై అంగన్వాడీ గుడ్డు.. తెలంగాణ ప్రభుత్వం అనే ముద్ర వేసి పంపిణీ చేస్తోంది.

విడతల వారీగా పంపిణీ

తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు అందిస్తున్న కోడి గుడ్లపై మూడు రంగులతో కూడిన ముద్రలు వేసి విడతల వారీగా అందిస్తున్నారు. జూలై నుంచి ఫిబ్రవరి వరకు నెలకు రెండు సార్లు అందిస్తారు. అలాగే మార్చి నుంచి జూన్ వరకు ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల గుడ్లు త్వరగా పాడైపోతాయనే భావనతో నెలకు మూడు విడుతలుగా అందిస్తున్నారు. జూలై నుంచి ఫిబ్రవరి వరకు అందించే గుడ్లపై ఎరుపు, ఆకుపచ్చ రంగులు.. మార్చి నుంచి జూన్ వరకు అందించే గుడ్లపై నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులను ముద్రిస్తారు. ముద్ర మధ్యలో అంగన్వాడీ పరిధి ఏ జోన్ పరిధికి వస్తుందో ఆ జోన్ నంబర్‌ను ముద్రిస్తారు. వికారాబాద్ జిల్లా 6వ జోన్ పరిధిలో ఉన్నందున కోడి గుడ్లపై ముద్ర మధ్యలో 6వ జోన్ అని ముద్రించి అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తోంది.



చిలుముల మైల్వార్ అంగన్వాడీ కేంద్రం

అక్రమాలకు తావు లేకుండా...

అంగన్వాడీ కేంద్రాల్లో చేరే మూడేళ్లలోపు చిన్నారులకు ప్రభుత్వం బాలామృతం, గుడ్లు, ఆరేళ్లలోపు పిల్లలకు గుడ్లు, పప్పు, కూరగాయలు, భోజనం, స్నాక్స్, అల్పాహారం, పల్లీపట్టి ప్రతి రోజు అందిస్తున్నారు. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న వారికి రెట్టింపు పోషకాహారాన్ని అందజేస్తుంది. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే వారికి రోజుకు ఒకటి చొప్పున గుడ్డు ఉడికించి ఇస్తున్నారు. వివిధ కారణాలతో అందుబాటులో లేక ఎవరైనా కేంద్రాలకు రాకపోతే వారికి అందజేసినట్లు రికార్డుల్లో రాసుకుని దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

కొడంగల్ క్లస్టర్‌లో 234 కేంద్రాలు

కొడంగల్ క్లస్టర్‌లో కొడంగల్, బొంరాస్ పేట్, దుద్యాల్, దౌల్తాబాద్ మండలలో మొత్తం 234 అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. క్లస్టర్ మొత్తం వివరాలు ఇలా ఉన్నాయి. గర్భిణులు-1,110, బాలింతలు-1,004 మంది, 7 నెలల నుంచి 1 సంవత్సర వరకు చిన్నారులు-1,190, 1 నుంచి మూడేళ్ల వరకు చిన్నారులు-3,965, మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులు-4,201 మంది ఉన్నారు.



ముద్రలు వేసిన కోడి గుడ్లు

పారదర్శకంగా పంపిణీ



అంగన్వాడీ కేంద్రాల్లో గుడ్లను మరింత పారదర్శకంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. మూడు రంగులు ఉన్న ముద్రలు వేసి అందిస్తోంది. దీంతో ఎలాంటి అక్రమాలకు తావులేదు. ముద్రలు ఉన్న గుడ్లు బహిరంగ మార్కెట్‌లో అమ్ముతున్నట్లు సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

– రజిత, ఇన్‌చార్జి సీడీపీఓ, కొడంగల్ క్లస్టర్

నేడు, రేపు ప్రాక్టికల్ పరీక్షలు

- గంట ముందే విద్యార్థులు సెంటర్లకు చేరుకోవాలి
- ఇంటర్‌బోర్డు నోడల్ అధికారి శంకర్
- ఎగ్జామ్ సూపరింటెండెంట్లకు అవగాహన

అనంతగిరి: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ అన్నారు. ఈ మేరకు వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 38 జనరల్, 10 ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జనరల్ ద్వితీయ సంవత్సరంలో 3,782 మంది సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులలో మొదటి సంవత్సరంలో 797 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 1,336 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష ఈనెల 29న, ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామ్ 30న ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్, ప్రింటర్, సీసీ కెమెరాలతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. రెండు సెషన్లలో ఎగ్జామ్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు బ్యాచ్‌లు, సబ్జెక్టుల వారీగా పరీక్షలు కొనసాగుతాయని స్పష్టంచేశారు. విద్యార్థులు తమ తమ కళాశాల నుంచి టైమ్ టేబుల్ తీసుకోవాలని సూచించారు. గంట ముందే సెంటర్‌కు చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ అధికారి

‘మండల పరిషత్’ ఏర్పాటుకు సన్నాహాలు

తాత్కాలిక కార్యాలయం కోసం భవనాల పరిశీలన

దుద్యాల్: మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా బొంరాస్‌పేట్ ఎంపీడీఓ వెంకన్న గౌడ్ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుద్యాల మండలం ఏర్పడి రెండేళ్లు గడుస్తోందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తాత్కాలిక ఆఫీసు ఏర్పాటు కోసం పంచాయతీ భవనం, దళిత వాడ పాఠశాలలోని ఓ గదిని పరిశీలించామని తెలిపారు. వీటి వివరాలను కడా ప్రత్యేక అధికారి అందిస్తామన్నారు. పై అధికారులకు అభిప్రాయాల మేరకు ఏదో ఒక చోట మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సత్య నారాయణ, మోహన్, కొడంగల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మేరుగు వెంకటయ్య, నాయకులు, శ్రీశైలం గౌడ్, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దళిత వాడ పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

తొమ్మిది మంది పేకాటరాయుళ్లు అరెస్టు

రూ.71 వేల నగదు, తొమ్మిది మొబైల్ ఫోన్లు స్వాధీనం

యాచారం: తొమ్మిది మంది పేకాటరాయుళ్లను మంగళవారం ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నర్సింహరావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కిషన్‌పల్లి గ్రామ శివారు ఓ వెంచర్‌లో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.71 వేల నగదు, తొమ్మిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్నకు బెయిల్

సిటీ కోర్టులు: రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పలువురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ-4గా ఉన్న తిరుపతన్నకు నాంపల్లి కోర్టు, హైకోర్టులో బెయిల్ లభించకపోవడంతో సుప్రీం కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్షతో రెండు పూచీకత్తులను సంబంధిత కోర్టులో దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం తిరుపతన్న తరుపు న్యాయవాదులు రెండు పూచీకత్తులను నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో అందజేశారు. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయన విడుదలయ్యారు. ప్రతి విచారణకు ఆయన కోర్టుకు హాజరు కావాలని నాంపల్లి కోర్టు పేర్కొంది.

తండాల్లో ఎక్సైజ్ దాడులు

ఆమనగల్లు: మాడ్గుల మండల పరిధిలోని జర్పులతండా, జగ్గుతండాలో మంగళవారం దాడులు నిర్వహించి 5 కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్‌చౌహాన్ తెలిపారు. రెండు తండాల్లో 25 కిలోల బెల్లం, 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, దశరథ్, బాబు, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

చిరుత కాదు.. అడవి పిల్లి



జక్కేపల్లి శివారులో లభ్యమైన అడవిపిల్లి పాదముద్రలు



అడవిపిల్లి కళేబరం

- జక్కేపల్లిలో చిరుత సంచరించిందని ప్రచారం
- పాదముద్రల ద్వారా జంగపిల్లిగా నిర్ధారించిన ఫారెస్ట్ అధికారులు

యాలాల: మండలంలోని జక్కేపల్లి శివారులో చిరుతపులి సంచరించిందంటూ జరిగిన ప్రచారం కలకలం రేగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన అమృతప్ప మంగళవారం ఎప్పటిలాగే ఊరి శివారులోని తన పొలానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిరుత పులిని పోలిన ఓ జంతువు, దాని వెంట రెండు పిల్లలను చూసి భయపడ్డాడు. ఈ విషయాన్ని స్థానికులతో పాటు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. జంతువు సంచరించిన ప్రాంతంలో లభ్యమైన పాదముద్రలను సేకరించారు. వీటి ఆధారంగా అది చిరుతపులి కాదని, అడవి పిల్లి(జంగపిల్లి) అని ఫారెస్టు సెక్షన్ అధికారి శంకర్ ధ్రువీకరించారు. వీటితో పాటు పొలాల సమీపంలో జంగపిల్లి కళేబరాన్ని గుర్తించారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.

ఆరుతడితో అధిక లాభాలు

- అపరాల సాగుతో భూసారం వృద్ధి
- జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

కేశంపేట: పంటల సాగులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించి అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు అన్నారు. మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. అపరాల పంటలైన పెసర, మినుము పంటలను సాగు చేయాలని తెలిపారు. ఆరుతడి పంటల్లో అధిక దిగుబడులతో పాటు మంచి లాభాలు వస్తాయన్నారు. వీటిద్వారా భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు. సాగు కాలం తక్కువగా ఉండటంతో ఎక్కువ సార్లు సాగు చేయవచ్చని వివరించారు. నాబ్‌కో సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ సంఘటిత నిధి ద్వారా నాబార్డ్ వంటి సంస్థలు వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ తదితర యూనిట్లకు రుణాలు అందిజేస్తోందని తెలిపారు. ప్రతీ మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో పాల్గొనే అధికారులు, శాస్త్రవేత్తలు సీజన్‌కు తగిన విధంగా రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం, కేశంపేట ఏఓ శిరీష, ఏఈఓలు వినయ్, నిఖిల్, ప్రశాంత్, సుధ, రాజేశ్వరితో తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

అక్షిత.. ‘ట్రిపుల్ గోల్డ్’

- జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యాచారం విద్యార్థిని
- స్టేట్ లెవెల్ పారా అథ్లెటిక్స్‌లో మూడు స్వర్ణాలు

యాచారం: రంగారెడ్డి జిల్లా యాచారం ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని అక్షిత జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం నిర్వహించిన సెవన్త్ స్టేట్ లెవల్ పారా అథ్లెటిక్స్ 100, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించింది. ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు చెన్నైలో నిర్వహించే జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో ఆమె పాల్గొననుంది. ద్రోణా చార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేశ్, అర్జున అవార్డు గ్రహీత జీవంజి దీప్తి, పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రశాంత్ తదితరులు స్టేడియంలో అక్షితను అభినందించారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, సీఐ నర్సింహారావు, పాఠశాల హెచ్‌ఎం నర్సింహ, పీడీ మల్లేశ్ తదితరులు అక్షిత ఎంపికపై హర్షం వ్యక్తంచేశారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అక్షిత (ఫొటోలో ఎడమ నుంచి మొదటి బాలిక)

‘హైదరాబాద్- బీజాపూర్’విస్తరణ చేపట్టాలి

రిలే దీక్షకు దిగిన మల్లారెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్ –బీజాపూర్‌రహదారి విస్తరణ వెంటనే చేపట్టాలని కోరుతూ మల్లారెడ్డి అనే వ్యక్తి రిలే దీక్షకు దిగాడు. చేవెళ్లలోని షాబాద్ చౌరస్తా సమీపంలో మంగళవారం దీక్షకు కూర్చున్నాడు. షాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి సామాజిక అంశాలపై తరచూ స్పందిస్తుంటాడు. ఈ రోడ్డు విషయంలో పలుమార్లు అధికారులతో మాట్లాడి పోలీసుల నుంచి అనుమతి తీసుకొని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రిలే దీక్ష చేపట్టాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ జరగకపోవడంతో నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు 46 కిలోమీటర్ల మీర నాలుగులేన్ల రహదారి విస్తరణ వెంటనే చేపట్టాలన్నారు. చేవెళ్ల ప్రాంతానికి చెందిన అఖిల పక్షం నాయకులంతా కలిసి రావాలని సూచించారు. రోడ్డు విస్తరణ జరిగే వరకు దీక్ష కొనసాగిస్తానని స్టంచేశారు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మల్లారెడ్డిని పలువురు అభినందించారు.



దీక్ష చేస్తున్న మల్లారెడ్డి

వేసవిలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

షాద్‌నగర్ డీఈ శ్యాంసుందర్ రెడ్డి

నందిగామ: రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడ ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు షాద్‌నగర్ ట్రాన్స్‌కో డీఈ శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పారిశ్రామిక వాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కడైనా విద్యుత్ తీగలు కిందకు వేలాడినట్లు ఉన్నట్లయితే సరిచేయడమే కాకుండా అవసరమైన చోట స్తంభాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వేసవిలో విద్యుత్ వినియోగం పెరగనుందని, దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. డివిజన్‌లోని 7 సెక్షన్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందితో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పారిశ్రామికవాడ అయిన కొత్తూరు, నందిగామ మండలాల్లో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, బిల్లులు సైతం అత్యధికంగానే ఉంటాయని పేర్కొన్నారు. షాద్‌నగర్ డివిజన్‌లోని ఏడు సెక్షన్లలో చాలాచోట్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీ రవీందర్, కొత్తూరు ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న డీఈ శ్యాంసుందర్ రెడ్డి తదితరులు

ట్రిపుల్‌తో ట్రబులే!

‘టు వీలర్ ఫర్ టు ఓన్లీ’.. మోటారు వాహనచట్టం స్పష్టం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం నగరంలో షరామామూలుగా మారింది. ప్రధానంగా యువతే ఈ ఉల్లంఘనకు పాల్పడుతూ నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం తెల్లవారు జామున డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌పై ముగ్గురు మైనర్లు చనిపోవడానికి ప్రధాన కారణం ట్రిపుల్ రైడింగే. ఈ ఉల్లంఘనపై ట్రాఫిక్ విభాగం అధికారులు ఏటా వేల కేసులు నమోదవుతున్నా.. వాహనదారుల వ్యవహార శైలిలో ఏమాత్రం మార్పు రావట్లేదు. – సాక్షి, సిటీబ్యూరో

- ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ప్రయాణాలు
- ప్రమాద హేతువులుగా మారుతున్న పరిణామాలు
- అత్తాపూర్ ఘటనకు ప్రధాన కారణం ఇలాంటి ఉల్లంఘనే
- సాంకేతికంగానూ ఈ డ్రైవింగ్‌తో ఇబ్బందులు ఎన్నో

మృతులు, బాధితుల్లో ఎక్కువ శాతం యువతే..

ద్విచక్ర వాహనాలపై ఒకరి కంటే ఎక్కువ మంది ప్రయాణించే వారిలో యువకులే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణంగా టు వీలర్స్ వినియోగించేది యూతే ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల బారిన పడుతున్న వారిలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది. బంధువుల కంటే స్నేహితులతో కలిసే ఎక్కువగా ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడుతుంటారు. ఎక్కడైనా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు కనిపించినా.. జంక్షన్ వచ్చినా.. ఆఖరులో కూర్చున్న యువకుడు తక్షణం దిగిపోయి నడుస్తూ ముందుకు వెళ్లడం పరిపాటి. ఇలా చేస్తూ ట్రిపుల్ రైడర్లు అనేక సందర్భాల్లో పోలీసుల్నీ పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా దూసుకుపోతూ తరచూ ప్రమాదాలకు లోనవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం అవివాహితులే కావడంతో కన్నవారికి పుట్టెడు దుఃఖం మిగులుస్తున్నారు.

వాహన అదుపు అసాధ్యం..

ప్రతి వాహనానికీ దాన్ని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగానే టు వీలర్‌ను కేవలం ఇద్దరు వినియోగించడానికి వీలుగానే రూపొందిస్తుంది. ముందు డ్రైవర్, వెనక పిలియన్ రైడర్ మాత్రమే ప్రయాణించాలంటూ తమ నిబంధనల్లో స్పష్టం చేస్తుంది. దీనికి సాంకేతికంగానూ ప్రత్యేక కారణాలు ఉన్నాయి. అవి ఏంటంటే..

- ఇంజిన్ కెపాసిటీ: మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజిన్‌కు ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీన్నే సాంకేతికంగా ఇంజిన్ కెపాసిటీ అంటారు. ఆ వాహనం ఎంతమంది ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తారో.. అదే సామర్థ్యంలో ఇంజిన్ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన ప్రయాణికుల కంటే ఎక్కువ మంది ఆ వాహనంపై ప్రయాణిస్తే దాని ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది.



యాక్సిలరేటింగ్ కెపాసిటీ: ఓ వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు ఈ కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కిమీ వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కిమీ మించదు. ఈ ప్రభావం ఓవర్ టేకింగ్ తదితర సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతుంది.

బ్రేకింగ్/బ్యాలెన్సింగ్ కెపాసిటీ: ఏదైనా వాహనం ప్రమాదానికి లోను కాకుండా ఉండాలంటే ఈ రెండూ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయగలగటం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. ట్రిపుల్ రైడింగ్ వంటివి చేసినప్పుడు ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీల పైనా పడి.. ఎదురుగా ముప్పును గుర్తించినా తక్షణం స్పందించి వాహనాన్ని ఆపలేరు.